క్లుప్తంగా

ఏఎంసీ నూతన పాలకవర్గం


నియామకపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి ఏఎంసీ నూతన పాలకవర్గానికి నియామక పత్రాలను మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ తిమ్మాపూర్ మండలంలోని తన క్యాంపు కార్యాలయంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి సమక్షంలో మంగళవారం అందజేశారు. నూతన చైర్మన్‌గా పులికృష్ణ, వైస్ చైర్మన్‌గా చిలువేరు శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్‌లుగా పులి సంతోశ్, బోనాల మల్లేశం, బండిపెల్లి రాజు, మచ్చ కుమార్, పుల్ల పోచయ్య, మాతంగి అనీల్, న్యాలపట్ల కనుకయ్య, ఒడ్నాల నర్సయ్య, నల్ల చంద్రారెడ్డి, చాడ మానిక, గుండ వెంకట్‌రెడ్డి, బోయినిపెల్లి కృష్ణారావులతో పాటు పీఏసీఎస్ చైర్మన్, డీఏంఓ, ఏడీఏ, బెజ్జంకి పత్యేక అధికారి ఉంటారని తెలిపారు. రాష్ట బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను మంగళవారం బెజ్జంకి ఏఎంసీ నూతన చైర్మన్ పులికృష్ణ, వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్‌రెడ్డి స్థానిక నాయకులు ఒగ్గ దామోదర్, రత్నాకర్‌లతో వెళ్లి కరీంనగర్‌లో కలిశారు. తమ నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

డిగ్రీ కళాశాలలో దోమల దినోత్సవం

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో మంగళవారం జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ దోమల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడ్డి మాట్లాడుతూ దోమలతో మానవాళికి అనేక రకాల వ్యాధులు వస్తాయన్నారు. మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. దోమలతో వచ్చే వ్యాధులు, వాటి నివారణ చర్యలను గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులతో పాటు అధ్యాపకులు హేమలత, విశ్వనాథం, మధుసూదన్‌రెడ్డి, పుణ్యమ్మ, వైకుంఠం, జగదీశ్వరాచారి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రతిష్ఠోత్సవాలు


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండల కేంద్రంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప, మహంకాళి ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ఘనంగా జరిగాయి. 21న జరిగే బీరప్ప కల్యాణోత్సవం సందర్భంగా మంగళవారం హోమం నిర్వహించారు. ఉదయం 9గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలను వైభవంగా జరిపించారు. బుధవారం విగ్రహ యంత్ర ప్రతిష్ఠోత్సవాల నిర్వహణ వరకు పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు మాజీ సర్పంచ్ బోడపట్ల శివ తెలిపారు. సుమారు 30మంది దంపతులు హోమంలో పాల్గొన్నారు. కురుమ సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోటాపోటీగా తరలివెళ్లిన రెండు పార్టీల నాయకులు


తరలివెళ్లిన బీఆర్ఎస్ నాయకులు

దుబ్బాక: దుబ్బాక నియోజకవర్గం నుంచి సిద్దిపేటకు అధిక సంఖ్యలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పోటాపోటీగా మంగళవారం తరలివెళ్లారు. రుణమాఫీ జరగని రైతులకు మద్దతుగా ఏమి చేయాలన్న అంశంపై చర్చించేందుకు 'ఛలో సిద్దిపేట'కు రావాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి పిలుపు మేరకు నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ ముఖ్య నాయకులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వివిధ వాహనాల్లో తరలివెళ్లారు. అలాగే రుణమాఫీ జరిగిన రైతులకు అభినందనలు తెలుపుతూ సిద్దిపేటలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి దుబ్బాక నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ వాహనాలలో సిద్దిపేటకు అధిక సంఖ్యలో తరలివెళ్లారు.

ట్రాఫిక్ సిగ్నల్స్‌పై పరేడ్

సిద్దిపేటకమాన్: విధి నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఏ విధంగా విధులు నిర్వహించాలనే అంశంపై సిగ్నల్ పరేడ్ నిర్వహించి సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన కూడళ్ల వద్ద సిగ్నల్స్ చూపిస్తూ వాహనదారులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. వాహనదారులు నిబంధనలు పాటించాలని సూచించారు.

డేంజర్ మలుపులు!

కొండపాక మండల శివారులో రాజీవ్ రహదారిపై పలుచోట్ల ఉన్న మూలమలుపులు ప్రమాదాలకు పిలుపులుగా మారాయి. సిద్దిపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్లేందుకు నిత్యం వందలాది వాహనాలు ఈ రహదారిపైనే రాకపోకలు సాగించాలి. మూల మలుపులు, డివైడర్లు సరిగా లేకపోవడం, రోడ్డు ధ్వంసమై గోతులు పడడడం లాంటి కారణాల వల్ల ఘోర ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

– కొండపాక(గజ్వేల్)

- రోడ్లు ధ్వంసమై ఏర్పడ్డ గోతులు
- డివైడర్లలో ఏపుగా పెరిగిన చెట్లు
- హెచ్చరిక బోర్డులు కరువు


దుద్దెడలో రాజీవ్ రహదారిపై మలుపు


బోల్తా పడిన బియ్యం లారీ(ఫైల్)


తిమ్మారెడ్డిపల్లి మలుపు వద్ద కారు ప్రమాదం(ఫైల్)

మండల పరిధిలో సుమారు 5నుంచి 6 చోట్ల ప్రమాదకర మూలమలుపులు ఉన్నాయి. వాటికి తోడు రాజీవ్ రహదారిపై బీటీ దెబ్బతినడంతో వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. దుద్దెడ, కొండపాక శివారులో గాయత్రి ఆలయం, తిమ్మారెడ్డిపల్లి, కుకునూరుపల్లి, కొమురవెల్లి కమాన్ వద్ద ఉన్న మూల మలుపుల వద్ద వాహనాలు అదుపు తప్పి బోల్తాపడి ఎంతో మంది మృత్యువాత పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

చెట్లు పెరిగి..

అయా రోడ్ల మధ్య నిర్మించిన డివైడర్‌లో చెట్లు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు, మలుపులు కనిపించడంలేదు. దీనికి తోడు రాత్రివేళల్లో రోడ్లు ధ్వంసమైన చోట గోతుల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు.

ప్రమాదాలు ఇలా..

ఇటీవల దుద్దెడలోని మూలమలుపు వద్ద వాహనాలు టర్న్ తీసుకుంటున్న సమయంలో అదుపుతప్పి రోడ్డు ప్రక్కన నివాసం ఉంటున్న ఓ ఇంటి ముందు పడ్డాయి. అలాగే తిమ్మారెడ్డిపల్లి శివారులో బీటీరోడ్డు దెబ్బతినడంతో మూలమలుపు వద్ద సడన్ బ్రేక్ వేయడంతో ఓ కారు అదుపుతప్పి ఎగిరి అవతలివైపు వెళ్తున్న మరో కారుపై పడింది. దీంతో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. అధికారులు స్పందించి మూలమలుపుల వద్ద ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

ధరణి సమస్యలను పరిష్కరించండి

- తహసీల్దార్‌కు రైతు సంఘం వినతి


వినతిపత్రం అందజేస్తున్న రైతుసంఘం నేతలు

గజ్వేల్‌రూరల్: ధరణిలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని రైతుసంఘం నాయకులు చేతిరెడ్డి లింగారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం రైతులతో కలిసి పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం ఐవోసీ(ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్) వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఐవోసీలోని ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం లింగారెడ్డి మాట్లాడుతూ నిజాం కాలంలో కుటుంబ యజమానిపైనే పట్టాహక్కు ఉండేదని, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రెవెన్యూ చట్టాన్ని అమలు చేయగా 1954లో కాస్రా పహాని రాసుకుంటూ కాస్తుచేసే రైతులకు పట్టాహక్కులు కల్పించారన్నారు. భూములు కొనుగోలు చేసిన సమయంలో కొందరు రిజిస్ట్రేషన్ చేసుకోలేనివారు సాదాబైనామాలోనే ఉన్నారని, గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి వల్ల తిరిగి భూస్వాములకే పట్టాహక్కులు కల్పించే స్థితి వచ్చిందని వాపోయారు. దీని వల్ల కబ్జాలో ఉన్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం చొరవ చూపి ధరణిలో నెలకొన్న లోపాలను సరిచేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు రాజేశం, నారాయణరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నర్సింహులు పాల్గొన్నారు.

భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న నాయకులు

- మాలమహానాడు, బీఎస్పీ నాయకులు

గజ్వేల్‌రూరల్: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నిర్వహించతలపెట్టిన భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని మాలమహానాడు, బీఎస్పీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం గజ్వేల్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ ఎస్సీ, ఎస్టీ సంఘాలు బుధవారం భారత్‌బంద్‌కు పిలుపునిచ్చాయని చెప్పారు. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ అందించిన హక్కులను కాపాడుకోవాలని కోరారు. రాజ్యాంగాన్ని మార్చే కుట్రలో భాగంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఈ వర్గీకరణ అంశాన్ని తీసుకొచ్చిందని, బీజేపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని మండిపడ్డారు. కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ కార్యదర్శి తుమ్మ శ్రీనివాస్, వర్గల్ మండల అధ్యక్షుడు ముల్క శ్రీనివాస్, బీఎస్పీ నాయకులు నరేశ్, రమణాకర్, కనకప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న యూఎస్ఎఫ్ఐ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గజ్వేల్‌రూరల్: ఎలాంటి అజెండా, లక్ష్యం లేకుండా యూఎస్ఎఫ్ఐ అనే విద్యార్థి సంఘాన్ని ఏర్పాటుచేసి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, ఈ విషయాన్ని విద్యార్థులు, విద్యాసంస్థల యాజమాన్యాలు గుర్తించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంజిత్‌రెడ్డి, ప్రశాంత్ సూచించారు. మంగళవారం గజ్వేల్‌లో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి ప్రవీణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థి అమరవీరుల పునాదులతో ఏర్పడిన సంఘాలు విద్యార్థుల కోసం పోరాటాలు చేస్తుంటే యూఎస్ఎఫ్ఐ పేరిట ఏర్పడిన విద్యార్థి సంఘం అక్రమ వసూళ్లకు పాల్పడుతుందని ఆరోపించారు. డబ్బులు వసూలుచేసి జల్సాలు చేస్తూ విద్యార్థి సంఘాల ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. వసూళ్లకు పాల్పడుతున్న సంఘాలను బహిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ప్రణయ్, భాస్కర్, అనిల్, లోకేశ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని గాయాలు

కొండపాక(గజ్వేల్): మోటార్ సైకిల్‌ను ఓ కారు ఢీకొట్టడంతో వాహనదారుడికి గాయాలైన ఘటన కొండపాక మండలంలోని బందారం, అంకిరెడ్డిపల్లి ప్రధాన కూడలి వద్ద మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. నంగు నూరు మండలంలోని ముండ్రాయి గ్రామానికి చెందిన సురేశ్ తన మోటార్ సైకిల్‌పై బందారం మీదుగా అంకిరెడ్డిపల్లికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో దుద్దెడ నుంచి బందారం వైపునకు వెళ్తున్న ఓ కారు ఢీకొట్టడంతో బైక్ ఎగిరి పడింది. దీంతో గాయపడిన సురేశ్‌ను స్థానికులు సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

నూతన కార్యవర్గం

తొగుట(దుబ్బాక): మండల పరిధిలోని కాన్గల్ గ్రామ కొండిన్య యూత్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మరుపల్లి రమేశ్‌గౌడ్ ఎన్నికయ్యారు. గ్రామంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయ ఆవరణలో మంగళవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా నాగరాజుగౌడ్, కార్యదర్శిగా ఐలుగొండ గణేశ్‌గౌడ్, కోశాధికారిగా వెంకట్‌గౌడ్, సహాయ కార్యదర్శిగా రాజుగౌడ్, కార్యవర్గ సభ్యులుగా స్వామి, శివప్రసాద్ తదితరులను ఎంపిక చేశారు.

ఘనంగా రాజరాజేశ్వరుడి రథోత్సవం

దుబ్బాక: మున్సిపల్ పరధిలోని లచ్చపేటలో మంగళవారం రాజరాజేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో రాఖీ పున్నమి మరుసటి రోజున స్వామి రథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఆలయంలో మూడు రోజులుగా ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ప్రధాన వీధుల గుండా స్వామివారి ఉత్సవ విగ్రహాలతో రథం ఊరేగింపు కనుల పండువగా సాగింది. తమ ఇండ్ల వద్దకు వచ్చిన పార్వతి పరమేశ్వరులకు మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బంగారయ్య, శ్రీజశ్రీకాంత్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ కేంద్రం ఏర్పాటు

తొగుట(దుబ్బాక): మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు రుణమాఫీ గ్రీవెన్స్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు మండల వ్యవసాయాధికారి మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రుణమాఫీ కాని రైతులు ఆధార్, రేషన్ కార్డులు, పట్టాదార్ పాస్ బుక్, క్రాప్‌లోన్ స్టేట్‌మెంట్, దరఖాస్తు ఫారంను కేంద్రంలో అందజేయాలని ఆయన రైతులకు సూచించారు.

రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివి

- ఘనంగా జయంతి వేడుకలు
- నివాళులర్పించిన కాంగ్రెస్ నేతలు


దుబ్బాకటౌన్: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

దుబ్బాకటౌన్/బెజ్జంకి(సిద్దిపేట)/కోహెడ(హుస్నాబాద్)/కొమురవెల్లి(సిద్దిపేట): దుబ్బాక పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో రవి, రాజిరెడ్డి, శ్రీనివాస్, ప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి, కిషన్‌రెడ్డి, సాయితేజ గౌడ్ తదితరులున్నారు. బెజ్జంకిలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గ దామోదర్, పార్టీ మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పోచయ్య, ప్రభాకర్, రాజు, మల్లేశం, ప్రవీణ్, రాజేశం, శ్రీనివాస్, రమేశ్, ఐలయ్య, రాములు, పరశురాములు తదితరులు పాల్గొన్నారు. కోహెడ లో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వేల్పుల వెంకటస్వామి ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద రాజీవ్ గాంధీ జయంతి నిర్వహించారు. రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, స్వీట్లు పంచారు. శెట్టి సుధాకర్, శంకర్, శ్రీనివాస్, స్వామి, మహేందర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. కొమురవెల్లి, చేర్యాల మండల కేంద్రాలలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. చేర్యాలలో జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో పేదరికనిర్మూలన, కమ్యూనికేషన్స్, టెక్నాలజీరంగాలకు గట్టి పునాదులు వేశారని చెప్పారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరంతర తాగునీటి సరఫరాకు చర్యలు

మద్దూరు(హుస్నాబాద్): మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు నిరంతరం తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మిషన్ భగీరథ డీఈఈ కృష్ణ తెలిపారు. మండలంలోని మర్మాముల, సలాఖపూర్, ధర్మారం గ్రామాలను ఏఈఈ లక్ష్మితో కలిసి ఆయన మంగళవారం సందర్శించారు. ఆయా గ్రామాలలో ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను పరిశీలించారు. పంచాయతీలలో ఏడు రకాల రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటిని సరఫరాచేసే ఓవర్‌హెడ్, మినీ ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలని, పైపులైన్‌లకు లీకేజీలు ఏర్పడితే వెంటనే సమాచారం అందజేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. తాగునీరు కలుషితమైతే రోగాలు ప్రబలే అవకాశముందని, అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, రేణుక, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రైతు పక్షపాతి రేవంత్ రెడ్డి

- రూ.2లక్షల వరకు రుణమాఫీ చేశాం
- జనగామ డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి


ఎండ్లబండిపై ర్యాలీగా వెళ్తున్న ప్రతాప్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): సీఎం రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతి అని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. రెండు లక్షల వరకు రైతులకు రుణమాఫీ జరిగినందున కొమురవెల్లి, చేర్యాల, మద్దూరు, దూల్మిట్ట, బచ్చన్నపేట మండల రైతులు, కార్యకర్తలతో కలసి మంగళవారం చేర్యాల పట్టణ కేంద్రంలోని గాంధీచౌక్ నుంచి మార్కెట్ యార్డు వరకు ఎండ్ల బండ్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మార్కెట్ యార్డులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ప్రజలకు ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేస్తోందన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచితబస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతులకు రెండులక్షల వరకు రుణమాఫీ జరిగిందని చెప్పారు. ప్రభుత్వం ప్రజలకు ఇస్తున్న సంక్షేమ ఫలాలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై నిందలు మోపుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో రైతులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

- కుక్కల నియంత్రణకు ఆపరేషన్లు
- మున్సిపల్ చైర్మన్ స్వరూపరాణి


మాట్లాడుతున్న స్వరూపరాణి

చేర్యాల(సిద్దిపేట): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్మన్ అంకుగారి స్వరూపరాణి సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ నాగేందర్‌తో కలసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విషయాలపై మున్సిపల్ కౌన్సిలర్లతో చర్చించారు. పట్టణంలో పెరుగుతున్న కుక్కల బెడదను తగ్గించేందుకు వాటికి ఆపరేషన్లు చేయాలని తీర్మానించారు. పట్టణంలోని వార్డులలో నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నిలిచిన నీటిని వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదే విధంగా మార్కెట్‌లో విక్రయదారులు వారి వ్యర్థాలను మున్సిపల్ చెత్తబండిలో వేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు అడెపు నరేందర్, సతీశ్‌గౌడ్, లింగం, చంటి, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'వృక్ష రక్షాబంధన్'



మొక్కలకు రక్షను కడుతున్న అధ్యాపకులు

సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో మంగళవారం బాటనీ విభాగం ఆధ్వర్యంలో వృక్ష రక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అయోధ్యరెడ్డి మాట్లాడుతూ మొట్టమొదటి సారిగా ఈ కార్యక్రమాన్ని మహాత్మాగాంధీ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రూరల్ ఎడ్యుకేషన్ ఎన్ఎస్ఎస్‌కు అనుబంధంగా కోల్‌కతాలో ప్రారంభించారని చెప్పారు. వృక్షాలను రక్షించి పర్యావరణాన్ని కాపాడాలని, ప్రతి ఒక్క రూ భావించి ఒక్కో మొక్కను నాటి దానిని పరిరక్షించాలని సూచించారు. బాటనీ విభాగాధిపతి డాక్టర్ రాణి మాట్లాడుతూ విద్యార్థులు మొక్కలకు రక్షగా ఉండాలన్నారు. అనంతరం మొక్కలకు రక్షను కట్టారు. కార్యక్రమంలో అధ్యాపకులు అనురాధ, శ్రీనివాస్, శైలజ, స్రవంతి, ఫాతిమ, శ్రీనివాస్, మధన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

– సిద్దిపేట ఎడ్యుకేషన్

సంక్షిప్త వార్తలు


◆ **నేడు కుకునూరుపల్లి తైబజార్‌కు వేలం**

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలో బుధవారం ఉదయం 10గంటలకు గ్రామ పంచాయితీ కార్యాలయంలో తైబజార్‌కు వేలంపాట నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆసక్తిగల వారు రూ.10వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని, తైబజార్‌ను దక్కించుకున్న వారు సగం డబ్బులను వెంటనే చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. తైబజార్ వేలంపాట కాలపరిమితి రెండేళ్ల వరకు ఉంటుందన్నారు.

◆ **దాడులు చేసేవారిని కఠినంగా శిక్షించాలి**

గజ్వేల్‌రూరల్: మహిళలపై లైంగిక దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య, బండ్ల స్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గజ్వేల్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కోల్‌కతాలోని ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ వైద్యురాలిపై లైంగిక దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ ఘటనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిష్పక్షపాతంగా న్యాయ విచారణ చేపట్టి నిందితులు ఎవరైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

◆ **అర్హులందరికీ రుణమాఫీ**



మర్కూక్(గజ్వేల్): అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం చెప్పారు. మంగళవారం మర్కూక్‌లో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షలలోపు ఉన్న రైతులందరికీ రుణమాఫీ వర్తిస్తుందన్నారు. రైతులు ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. బీఆర్ఎస్ హయాంలో లక్ష రుణమాఫీ కూడా చేయలేదని, నేడు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై అబద్ధాలు చెబుతూ ఆరోపించడం రైతులు గమనిస్తున్నారన్నారు. నాయకులు యాదగిరి, శంకర్, నర్సింహులు, రవి, కనకయ్య పాల్గొన్నారు.

◆ **సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ**

తొగుట(దుబ్బాక): మండలంలోని గోవర్ధనగిరిలో పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ తోయేటి ఎల్లయ్య రూ.60వేలు, తోయేటి రక్షితకు రూ.11వేలు చెక్కులు అందజేశారు. ఏఎంసీ మాజీ డైరెక్టర్ కనకయ్య, నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, రాఘవులు, కుమార్, స్వామి, నరేంద్ర, భైరారెడ్డి, కమలాకర్ పాల్గొన్నారు.

◆ **రుణమాఫీపై ఆందోళన చెందొద్దు**

చిన్నకోడూరు(సిద్దిపేట): మూడు విడతల్లో రైతులకు రుణమాఫీ డబ్బులు వారివారి ఖాతాల్లో జమ చేశారని, జమకాని రైతులు ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయ అధికారి జయంత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం చిన్నకోడూరు రైతువేదికలో రుణమాఫీపై రైతులతో చర్చించి వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఖాతాలు సరిగా లేకపోవడం, ఆధార్ నంబర్‌లలో తప్పులు, బ్యాంకు ఖాతాల్లో, ఆధార్‌లో ఉన్న పేర్లతో సరిపోని ఖాతాలు ఉండడంతో కొంత మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. రైతుల విజ్ఞప్తులు స్వీకరించడానికి వ్యవసాయశాఖ కార్యాలయంలో కౌంటర్‌లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

◆ **ఉపాధ్యాయుల మృతికి సంతాపం**

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని అందె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న యాసరేణి రాములు అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతికి గ్రామస్తులు, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు మంగళవారం పాఠశాలలో సంతాపం వ్యక్తం చేశారు. రాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ జోగు ప్రభుదాసు మాట్లాడుతూ... నిబద్ధతతో పనిచేసిన రాములు మృతి తీరని లోటన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, ప్రవీణ్‌బాబు, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలలో..

మర్కూక్(గజ్వేల్): మర్కూక్‌లో కేజీబీవీ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు గీతాదేవి మృతి ఉపాధ్యాయ వృత్తికి తీరనిలోటని ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి అన్నారు. ఆమె అంత్యక్రియల్లో పాల్గొని నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. ఆమె మృతిపై పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే వలి అహ్మద్, ప్రధాన కార్యదర్శి యాదగిరి, వెంకట్‌కిరణ్, ఉపాధ్యాయ సంఘాల నేతలు సంతాపం వ్యక్తం చేశారు.